క్లుప్తంగా

నాయీబ్రాహ్మణ సంఘాధ్యక్షుడిగా వీర్రాజు



కొవ్వూరు: నాయీబ్రాహ్మణ సంఘం కొవ్వూరు పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా మేడూరి వీర్రాజు ఎంపికయ్యారు. ఆ సంఘ సమావేశం మంగళవారం స్థానిక సత్యవతీ నగర్‌లోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జరిగింది. సలహాదారుడిగా పొన్నాడ సూరిబాబు, కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడిగా బొండపల్లి నరసింహారావు, ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి అంజిబాబు, చింతలపూడి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా కోడూరి రాము, గౌరవ సలహాదారులుగా తాటిపూడి సూర్యారావు, పట్నాల రామారావు, కోడూరి అప్పారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వీర్రాజు మాట్లాడుతూ నవంబర్ 26న సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి జారిపడి తలకు తీవ్ర గాయాలైన వ్యక్తి మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన కోమల వెంకటేశ్వరరావు ఈనెల 21వ తేదీన నిడదవోలు వెళ్లి ఇంటికి వస్తుండగా సమిశ్రగూడెం చెర్వు గట్టు వద్ద ఉన్న కర్రీ పాయింట్ వద్ద బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలైన వెంకటేశ్వరరావును రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించిన వైద్యం అందిస్తుండగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై అతడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

నేడు దేవరపల్లిలో బాలికల క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ -14, అండర్- 17 బాలురు, అండర్- 17 బాలికల జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర జట్ల ఎంపిక తణుకు మండలం తేతలిలోని స్టెప్పింగ్ స్టోన్స్ స్కూలు వద్ద, బాలిక జట్టు ఎంపిక దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో జరుగుతాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 8074153923ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

అన్నదేవరపేటలో అయ్యప్ప కలశ పూజ



అన్నదేవరపేటలో కలశ పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

తాళ్లపూడి: అయ్యప్ప మాలధారుల శరణుగోషతో అన్నదేవరపేట బీసీ కాలనీలోని దుర్గాదేవి ఆలయం సోమవారం రాత్రి మార్మోగింది. అయ్యప్ప కలశ పూజ మహోత్సవాన్ని ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్ప మాలధారులు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు, సీతానగరం బుల్లి రాంబాబు గురుస్వామి, మన్యం సీతారామయ్య, రామన వీరబుజ్జియ్య గురుస్వాములు, రామన దుర్గారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కలశ పూజలో మండలంలోని వివిధ గ్రామాల నుంచే గాకుండా కొవ్వూరు, పోలవరం మండలాల నుంచి దాదాపు 800 మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. అనంతర స్వాములందరికీ వడి ఏర్పాటు చేశారు.

40 పశువులకు గర్భకోశ పరీక్షలు

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 పశువులకు వైద్యులు గర్భస్థ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా వాక్సిన్ వేశారు. జాతీయ పశుగణన పోస్టర్లు ఆవిష్కరించారు. పశు సంవర్ధక శాఖ కొవ్వూరు ఉప సంచాలకుడు ఎస్.సత్యనారాయణ పశు సంవర్ధక శాఖ పెంటపాడు ఉప సంచాలకుడు జి .జేసురత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ పులిదంటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు, పశువైద్యులు వి .రుషి ప్రసాద్, చరణ్, సల్మా, శ్రీనివాస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

'ద్వారబంధాల' జీవిత చరిత్ర పాఠ్యాంశంగా పెట్టాలి

దేవరపల్లి: తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, గోదావరి జిల్లాలకు చెందిన ద్వారబంధాల చంద్రయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి, ఆయన శిలావిగ్రహాలను రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సువర్ణరాజు మంగళవారం ఆమెను కలసి వినతిపత్రం అందజేశారు. 1879లో గోదావరి జిల్లాల నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తొలి ఉద్యమకారుడు చంద్రయ్య అని సువర్ణరాజు తెలిపారు.

అప్పులతోనే హాస్టల్ ఫుడ్

- కూటమి ప్రభుత్వంలో విడుదల కాని మెస్ బిల్లులు
- సరకులు అరువుకు తెస్తున్న అధికారులు
- కాస్మెటిక్స్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు



సమిశ్రగూడెంలోని ఎస్సీ బాలికల వసతి గృహం



సమిశ్రగూడెం బీసీ వసతిగృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

నిడదవోలు రూరల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అప్పు చేసి పప్పు కూడు పెట్టాల్సిన పరిస్థితులు దాపురించాయి. విద్యార్థుల మెనూకు అవసరమైన నిధులను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం వల్ల హాస్టళ్ల నిర్వహణ రోజురోజుకూ భారంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యార్థుల మెస్ బిల్లులు విడుదల కాలేదు. పెరిగిన నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని ఓ వైపు సంక్షేమాధికారులు మొరపెట్టుకుంటున్నా ఫలితం దక్కడం లేదు. బియ్యం మినహా మిగిలిన సరకులన్నింటినీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిందే. నెలల తరబడి సరకులను అరువు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడం లేదు. ముఖ్యంగా పాలు, పెరుగు, కూరగాయలు, గుడ్లు, చికెన్ మొదలైన వాటిని క్రమం తప్పకుండా కొనుగోలు చేయాలి. నిత్యం హాస్టళ్లకు వాటిని సమకూర్చేందుకు వసతి గృహ సంక్షేమాధికారులు అప్పుల పాలవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా డైట్ చార్జీలు విడుదల చేస్తూ వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ నాలుగు నెలల్లో హాస్టళ్ల నిర్వహణను పట్టించుకోలేదు. దాంతో అవి గాడి తప్పుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. బిల్లుల విడుదలలో జాప్యం వల్ల కొన్ని హాస్టళ్లలో మెనూ సక్రమంగా పాటించకుండా కోత విధిస్తున్నట్టు తెలుస్తోంది.

నియోజకవర్గంలో 900 మంది

నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు తొమ్మిది ఉన్నాయి. వాటిలో సుమారు 900 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు రూ.36.50 లక్షల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాస్టళ్ల విద్యార్థుల కోసం కమ్మని భోజనం మెనూ అమలు చేయించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో హాస్టళ్లలో అడ్మిషన్లు పెరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం మెస్ చార్జీలను విడుదల చేయక పోవడంతో ప్రతి నెలా అప్పులు పెరిగిపోతున్నాయని వార్డెన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలు నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో పాత ధరలకు సరఫరా చేయలేక కొన్నింటిని మాత్రమే సరఫరా చేస్తున్నాయి. తమకు వస్తున్న జీతంలో రకరకాల ఈఎంఐలు పోగా మిగిలిన జీతంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో, హాస్టళ్లను ఎలా నిర్వహించాలో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్సీ వసతిగృహాలకు మెస్ ఛార్జీలు ఒక్క రూపాయి రాలేదు. అయితే బీసీ వసతి గృహాల విద్యార్థులకు మాత్రం జూన్, జూలై నెల వరకూ మెస్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేసినట్టు సంక్షేమాధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నెలవారీ డైట్ చార్జీలు	
3-4 తరగతులకు	రూ.1150
5-10 తరగతులకు	రూ.1,400
ఇంటర్మీడియట్ ఆపై తరగతులకు	రూ.1600



వసతిగృహంలోని మెనూ చార్ట్ ఫ్లెక్సీ

కాస్మెటిక్ చార్జీలదీ అదే పరిస్థితి

హాస్టళ్ల విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను గత ప్రభుత్వం నేరుగా వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మూడు నుంచి ఆరో తరగతి వరకూ బాలురకు రూ.120, బాలికలకు రూ.130, ఏడు నుంచి పదో తరగతి వరకూ బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ.200, విద్యార్థినులకు రూ.200 చొప్పున కాస్మెటిక్ చార్జీలుగా ప్రభుత్వం చెల్లించేది. ఈ చార్జీలను ఈ ఏడాది మార్చి నెల వరకూ మాత్రమే ఆయా విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు.

కాస్మెటిక్ చార్జీలు వెంటనే చెల్లించాలి



హాస్టళ్లకు బకాయిపడిన మెస్ చార్జీలతో పాటు విద్యార్థులకు అందించే కాస్మెటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలి. హాస్టళ్ల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మౌలిక వసతులు కూడా కల్పిస్తే వాటిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాం.

– బావన సంగీత, విద్యార్థిని, సమిశ్రగూడెం

వసతిగృహాలపై దృష్టి సారించాలి



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పేద, మధ్య తరగతి విద్యార్థులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతి, విద్య అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. మెస్ బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమిశ్రగూడెంలో రెండు బాలికలు వసతి గృహాలు ఉన్నాయి. బాలుర వసతిగృహం కూడా ఏర్పాటు చేయాలి.

–గెద్దం రవీంద్రబాబు,కేఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సమిశ్రగూడెం

విద్యార్థుల ఫీజుల చెల్లింపునకు 'మానవత' సాయం



ఇంజినీరింగ్ విద్యార్థిని గోపిశెట్టి నీలిమకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: మండలంలోని ఇద్దరు పేద విద్యార్థుల కళాశాలల ఫీజుల చెల్లింపునకు మానవత సంస్థ మండల శాఖ అండగా నిలిచింది. తెలికిచెర్లకు చెందిన గోపిశెట్టి నీలిమ తాడేపల్లిగూడెం శశి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఫీజు చెల్లించుకోలేని స్థితిలో ఉన్న ఆమెకు రూ.10,000 ,చీపురుగూడెంకు చెందిన వసంతాడ కిరణ్‌కుమార్ ఆంధ్రా లయోలా కళాశాల్లో ఎంబీఏ సెకండియర్ చదువుతున్నాడు. అతనికి రూ.15,000 మానవత సంస్థ సమకూర్చింది. ఈ మొత్తాలను చెక్కుల రూపంలో ఆయా కళాశాలల యాజమాన్యాలకు అందజేశామని మానవత సంస్థ సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. కార్యక్రమాల్లో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షురాలు ఝాన్సీరాణి, గుళ్ళపూడి వెంకటరత్నం, గుత్తికొండ వరప్రసాద్, పాతూరి సత్యనారాయణ, ఐడీపీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొవ్వూరు విద్యార్థులు



జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కొవ్వూరు ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం శ్యాంసన్, పీఈటీ భాస్కర్

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ అండర్-14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. సత్యసాయి హిందూపురంలో ఈనెల 25 నుంచి 27 వరకూ నిర్వహించిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల బాలికల విభాగంలో ఈ పాఠశాల విద్యార్థిని పి.దివ్యశ్రీ , బాలుర విభాగంలో వి.నాగరాజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు నాలుగో స్థానం సాధించడంలో కొవ్వూరు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ క్రమంలో త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పి.దివ్యశ్రీ , వి.నాగరాజులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శ్యాంసన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎస్.భాస్కర్‌ను హెచ్‌ఎం అభినందించారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి

నల్లజర్ల: లార్వా దశలోనే దోమలను నివారించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యతలపై మంగళవారం మండలంలోని పోతవరం, గంటావారిగూడేల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, డ్రైడే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆయన పర్యవేక్షించారు. అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని లక్ష్మణరావు సూచించారు. దోమలు కుట్టకుండా రాత్రి సమయాల్లో దోమతెరలు వినియోగించాలన్నారు. నీటి నిల్వ ఉన్న గుంటలపై దోమగుడ్లు పెట్టి లార్వా దశ నుంచి దోమగా మారడానికి 10 రోజుల సమయం పడుతుందన్నారు. ఈలోగా నిల్వ ఉన్న నీటి గుంటలను నిర్మూలించాలని సూచించారు. ఇది ఖర్చు లేని పని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య పర్యవేక్షకులు సత్యనారాయణ, ప్రకాశ్, ఆరోగ్య కార్యదర్శి సువర్ణ, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు శాంతకుమారి, దుర్గ, రాజేశ్వరి, రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



కానూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో మేరీ కిరణ్

పెరవలి: సార్వా ధాన్యం మాసూళ్లు ఈ నెలాఖరు నాటికి మొదలవుతాయని, రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎ.మేరీకిరణ్ తెలిపారు. మండలంలోని తీపర్రు, కానూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో సొమ్ములు రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయన్నారు. మరోపక్క దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధం కావాలని సూచించారు. దాళ్వాలో ఏయే రకాల వరి విత్తనాలు నాటుకుంటే ఎక్కువ దిగబడి వస్తుందో ఏవో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మాచరమ్మ, రైతులు పాల్గొన్నారు.

నోటీసు లేకుండా ఇంటిని కూల్చేశారు

- మూడు రోజుల తర్వాత పంచాయతీ ఆఫీసు నుంచి నోటీసు
- లబోదిబోమంటున్న ఇంటి యజమాని
- నల్లాకులవారిపాలెంలో ఘటన



నల్లాకులవారిపాలెంలో ఇంటిని కూల్చివేసి చదును చేస్తున్న పొక్లెయిన్



కూల్చి వేసిన ఇంటికి పంచాయతీ లోగడ జారీ చేసిన పన్ను రశీదు



కూల్చి వేసిన మూడు రోజులకు పంచాయతీ జారీ చేసిన నోటీసు

పెరవలి: మండలంలోని నల్లాకులవారిపాలెం గ్రామ పరిధిలో కొత్తపల్లి అగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే గల ఇళ్ల దుర్గాప్రసాద్‌కు చెందిన ఇంటిని ఈనెల 26న పొక్లెయిన్‌తో కూల్చి వేశారు. ముందుగా నోటీసు కూడా ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు కూడా తీసుకోనివ్వకుండా ఇంటిని నేలమట్టం చేశారు. ఈ ఘటనపై ఇంటి యజమాని దుర్గాప్రసాద్ లబోదిబోమంటున్నారు. ఈ ఇంటిని సుమారు 50 ఏళ్ల క్రితం దుర్గాప్రసాద్ తాత ఇళ్ల వెంకట్రావు నిర్మించారు. మూడు తరాలుగా ఆ కుటుంబం అదే ఇంట్లో నివశిస్తోంది. ఇంటిని ఎందుకు కూల్చివేశారని దుర్గాప్రసాద్ సామాజిక వర్గీయులు పంచాయతీ పెద్దలను గట్టిగా ప్రశ్నించారు. 'ఈ రోడ్డును కొత్తగా విస్తరించి నిర్మిస్తున్నారు. అందుకు మంత్రి కందుల దుర్గేష్ నిధులు కూడా మంజూరు చేశారు. ఈ విషయంలో తామేమీ చేయలేం' అంటూ పంచాయతీ పెద్దలు బదులివ్వడంతో దుర్గాప్రసాద్ కులపెద్దలు ఆగ్రహించారు. ఇంటిని కూల్చేసిన మూడు రోజుల తర్వాత మంగళవారం నాడు 'త్వరలో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉంటే తొలగించుకోండి' అంటూ దుర్గాప్రసాద్‌కు పంచాయతీ నోటీసు జారీ చేసింది. ఇల్లు కూల్చివేసిన మూడు రోజులకు నోటీసు ఇవ్వడం ఏమిటని పలువురు గ్రామస్తులు తప్పుబడుతున్నారు.

దీనిపై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ ఇంటి రోడ్డు సుమారు 25 అడుగుల వెడల్పు ఉంటుందన్నారు. కావాలనే తన ఇంటిని కొత్తపల్లి అగ్రహారం పంచాయతీ సర్పంచ్ భర్త బండారు సాయి అధికారులపై ఒత్తిడి తెచ్చి కూల్చి వేయించారని ఆరోపించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు అబ్బిశెట్టి సత్తిరాజు దగ్గరుండి మరీ తన ఇంటిని కూల్చివేయించాని ఇళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. తన ఇంటికి పంచాయతీ విధించి పన్నులు చెల్లిస్తున్నానని, కరెంట్ మీటర్ కూడా ఉందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చాగల్లు: మండలంలోని మార్కొండపాడులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు తమ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. బ్రాహ్మణగూడెం రైతుల భూమి నిడదవోలు రెవెన్యూ పరిధిలో ఉన్నందున స్థానికంగా ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎడ్లబండ్లపై కూడా ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రశేఖర్, తహసీల్దార్ ఎం.మెరికమ్మ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు గారపాటి బాబురావు, సుంకవల్లి రమేష్ దొమ్మేటి వేణు, ఆత్కూరి కృష్ణ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

36 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

దేవరపల్లి: పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన మద్యం బెల్ట్ దుకాణాలపై దేవరపల్లి పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. మండలంలోని దుద్దుకూరులో నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంపై దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని డైమండ్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న మరో బెల్ట్ దుకాణంపై దాడి చేసి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. మండలంలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

70 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు మంగళవారం తెలిపారు. కోరుమామిడికి చెందిన ఈడూరి లక్ష్మణరావు వద్ద 40 క్వార్టర్ బాటిళ్లు, సుంకర రత్నకుమారి వద్ద 30 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీన పరుచుకుని, వారిద్దరినీ అరెస్టు చేసినట్టు ఎస్సై చెప్పారు.

కొవ్వూరు మండలం, పట్టణంలో..

కొవ్వూరు: అనధికారికంగా తోగుమ్మి గ్రామంలో బీరు బాటిళ్లు విక్రయిస్తున్న వర్ధనపు మోహన్‌రావు అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. అతడి వద్ద నుంచి ఆరు బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే పట్టణంలోని రాజీవ్ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఉప్పాడ వీరబాబు అనే వ్యక్తిని టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.అతడి వద్ద నుంచి రెండు బీర్లు, తొమ్మిది క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. దొమ్మేరు సావరంలో చిగురుపల్లి అమ్మాజీ అనే మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద పది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిడదవోలు పట్టణ ఎస్‌ఐ శోభన్‌కుమార్

నిడదవోలు: ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలతో పాటే సైబర్ మోసాలు కూడా ఇటీవల బాగా పెరిగిపోయాయని, వాటి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై పి.శోభన్ కుమార్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఆర్పీలకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై శోభన్‌కుమార్ మాట్లాడుతూ బలహీనమైన ఆన్‌లైన్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్ కలిగి ఉంటే హ్యాకర్లు బ్యాంకు కస్టమర్ల ఖాతాలను సులభంగా హ్యాక్ చేయగలుగుతారన్నారు. అపరిచితులు తొలుత తమను బ్యాంకు అధికారులుగా పరిచయం చేసుకుంటారన్నారు. ఓటీపీ తెలుసుకొని మీ బ్యాంకు ఖాతాలోని సొమ్మును ఖాళీ చేస్తారన్నారు. బ్యాంకు అధికారులు ఎప్పుడు ఖాతాదారులకు కాల్ చేసి ఓటీపీ అడగరనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు . కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ ఎ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 11 కేవీ నూతన టౌన్ ఫీడర్ పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజుకున్న వేగేశ్వరపురం లిఫ్ట్ ఎన్నికల రగడ

- ఎమ్మెల్యే 'ముప్పిడి' వద్దకు చేరిన పంచాయితీ
- ప్రస్తుత సంఘాన్ని రద్దు చేయాలని రైతుల డిమాండ్



కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం రైతు సంఘం ఎన్నికల రగడ మొదలైంది. రెండు దశాబ్దాలుగా ఒకే రైతు సంఘం పెత్తనం కొనసాగడంపై ఆయకట్టు రైతుల్లో విభేదాలు మొదలయ్యాయి. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘాన్ని తక్షణమే రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలనే వాదన తెరపైకి వచ్చింది. ఇటీవల ఏపీఎస్ఐడీసీ అధికారులు ఎత్తిపోతల పథకాల రైతు సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుత కమిటీ మాత్రం కొన్నేళ్లుగా కోర్టు స్టే తోనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులంతా ఎన్నికల పంచాయితీని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వద్ద పెట్టారు. కొవ్వూరులో మంగళవారం ఎమ్మెల్యే రైతు సంఘం నాయకులతో ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు రైతు సంఘం పదవి కోసం జనసేన, బీజేపీ నాయకులు కూడా పోటీ పడుతున్నారు. ప్రస్తుత కమిటీలో తనకు నచ్చిన వ్యక్తులను పెట్టుకుని కోర్టు స్టే అడ్డుపెట్టుకుని కాలక్షేపం చేస్తున్నారని రైతు నాయకులు దుయ్యబట్టారు. ఇటీవల టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు వద్దకు వెళ్లి రైతు సంఘం ఎన్నికలపై చర్చించినట్టు చెబుతున్నారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే ముప్పిడిని కలసి తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. ప్రస్తుత రైతు సంఘం నిర్వహణ కమిటీ టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలోనే ఉన్నప్పటికీ పార్టీలకు అతీతంగా రైతులందరూ ఎమ్మెల్యేను కలవడం చర్చనీయాంశమైంది. ఈ ఎత్తిపోతల పథకానికి కొత్త కమిటీని ఏర్పాటు చేసి కూటమి నాయకులకు ప్రాధాన్యం కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను ఎమ్మెల్యే ముందు ఉంచినట్టు చెబుతున్నారు. రైతు సంఘం నాయకులు కాకర్ల శ్రీనివాస్, గన్నిన సత్తిబాబు, అన్నంరెడ్డి సత్తిబాబు, తైలం పోశారావు, సూలా పోసియ్య, ఉప్పులూరి రమేష్, మద్దుకూరి శంకరం, తైలం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.